# పూర్వ యవనిక

★

"విశ్వశాంతి" ఒక విచిత్రమైన నాటకం ఇందలి పాత్రలు వ్యక్తులుకారు. సంకేతాలు నాటకమంతా ఒక దృక్పథాన్ని, ఒక నీతిని, ఒక సందేశాన్ని ప్రసారం చేస్తుంది. నేటి ప్రపంచాన్నంతా కలవరపెడుతున్న ఒక ప్రధాన సమస్య ఇందలి ఇతివృత్తం. ఇంగ్లీషులో ఈ తెగకు చెందిన నాటకాలను **Morality Plays** అంటారు. మనకికూడా "ప్రబోధ చంద్రోదయం" వంటి ఇలాంటి నాటకాలు కొత్తవికావు. అత్యున్నతమైన ఒక ఆధ్యాత్మిక స్థాయి నందుకుంటేనే తప్ప ఏ రచయితా ఇటువంటి నాటకాలకి ప్రయత్నించి కృతకృత్యుడు కాలేడు. ప్రథమ ప్రయత్నంలోనే ఈ కృతార్థత సాధించిన ఆచార్య ఆత్రేయ అభినందనీయుడు.

హితోపదేశం ఎంతైనా కష్టమైన పని. ఒక విషయం మీద అచంచల విశ్వాసంలేనిదే ఇందు కసలు పూనుకోవడమే మంచిదికాదు అందులోకీ అనేకానేక మనస్తత్వాలు గల ప్రేక్షకుల్ని రంజింపజెయ్యవలసిన నాటకరంగాన్ని బోధనా వేదికగా చేసుకోవాలంటే అసాధారణాధికారాలు కావాలి. ఉపన్యాసాలతో ఉదర గొట్టే పాత్రల మీద సామాజికులకు సానుభూతి వుండదు. అందుకుతగ్గ సముచితమైన సన్నివేశాలు కల్పించి ప్రేక్షకుల ఉత్కంఠను మున్ముందుగా రచయిత అకట్టుకొనగల గాలి. ఇదో రకం ఇంద్రజాలం. ఈ యింద్రజాలం "విశ్వశాంతి" నాటకంలో సమృద్ధిగావుంది. ఉండబట్టే ఏ పాత్ర ఎంత దీర్ఘంగా మాట్లాడినా ఎవరికీ విసుగుపుట్టదు.

అయితే ఇదే మాదిరి ఇంద్రజాలాన్ని ప్రయోగించి ఎవడైనా దుష్టరచయిత ప్రజల్ని దుర్మార్గాలకి మళ్ళించవచ్చు. అదృష్టవశాత్తూ మంచితనం తరఫున వకాల్తా పుచ్చుకున్న ఆత్రేయవంటి రచయిత యిందుకు పూనుకున్నాడు. అతనిది దేవతలు ఆశీర్వదించే ఉద్యమం.

ఉన్న చిక్కంతా ఎక్కడొచ్చి పడిందంటే భౌతికంగా మనం ఇవాళలో జీవిస్తున్నప్పటికీ నైతికంగా మన మనస్సులు నిన్నకి అంకితమై అంటుకుపోయాయి ఎవడిలాభం వాడు చూచుకోవడం నిన్నటి నీతి. ఈ ధర్మ సూత్రాన్ని పరిరక్షించ డానికి మన సామాజిక వ్యవస్థ సర్వసన్నద్ధంగావుంది. అవసరమైతే ఆయుధాల

సాయంతో ఈ నీతిని నిలబెడతానంటుంది మన వ్యవస్థ. కాని ఇది తుప్పుపట్టిన భావం, కుళ్ళిపోయిన నీతి అని యుక్తాయుక్తాలు తెలిసిన వేత్తలు చెబుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సమష్టి క్షేమం అనే నినాదాన్ని వీరు లేవదీస్తున్నారు. ధనం, బలం, కులం; మతం అన్ని అండలూ చూసుకొని ఎంతగా ఎదురొడ్డి నిలచినా స్వప్రయోజనపరులికమీద సమష్టిక్షేమ ధర్మసూత్రాన్ని పరాస్తంచెయ్యలేరు.

సమస్త ప్రపంచం ఈ నాడు క్రమక్రమంగా రెండేరెండు శిబిరాలుగా ఘనీభవిస్తోంది. కామందులకు లాభం చేర్చే యుద్ధం, సామాన్యులకి క్షేమంకూర్చే శాంతి ఈ రెండూ ఒక త్రాసుని ఇరువైపులా లాగుతున్నాయి. తెలిసి కొందరూ తెలియక కొందరూ మొత్తంమీద అందరూ ఏదో ఒక పక్కకి ధ్రువపడుతున్నారు. ప్రాణవాయువు జీవితానికివలె, మానవజాతి సమష్టి క్షేమానికి శాంతి అత్యావసరమని గుర్తించ గలిగిన వాళ్ళంతా తమ యావచ్ఛక్తులతో మోహరించి నిలిస్తే అసలు యుద్ధమనేదే లేకపోవచ్చును. ఎన్నెన్నో పాతకాలపు రోగాలను రూపుమాపగలిగిన నాగరిక మానవుడు ఆటవిక యుగాల అపశేషమైన యుద్ధోన్మాదమనే మానసిక వ్యాధికి సమష్టి ప్రక్రియలతో చికిత్సచేసుకోగలడు.

నాటకరంగమనే వైద్యశాలలో జరుగుతున్న ఒక చికిత్సా విధానమే ఈ "విశ్వశాంతి".

మద్రాసు
23–1–'53

శ్రీరంగం శ్రీనివాసరావు.

